ప్రజాశక్తి
www.prajasakti.com
బుధవారం 24 జులై 2024
5
వైఎస్ఆర్



సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో మున్సిపల్ కార్మికుల కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయభాస్కర్ కోరారు. మంగళవారం శంకరాపురంలోని మున్సిపల్ కార్మికుల కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర గొప్పదని కొనియాడారు. వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మాత్రం సమస్యలు చాలా ఘోరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు, మంచినీటి కొళాయి కనెక్షన్లు, రోడ్ల సౌకర్యం, పర్మినెంట్ ఇండ్లు లేకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మదనపల్లె మంటలపై
దర్యాప్తు వేగవంతం

- రెవెన్యూ రికార్డులను జల్లెడ పడుతున్న అధికారులు
- రికార్డుల పరిశీలనలో డిఆర్ఒ, 5 బృందాలు
- సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుతున్న రికార్డులు
- సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన స్పెషల్ సిఎస్ సిసోడియా, కలెక్టర్లు



సబ్ కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ సిఎస్ సిసోడియా, కలెక్టర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసు పోలీసులు, రెవెన్యూ అధికారులు వేగవంతం చేశారు. కుట్రకోణంపై పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. ఫైళ్ల దహనంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన కీలక దస్త్రాలు, వివిధ రకాల భూములకు చెందిన కీలక డాక్యుమెంట్లు కాల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం పూర్తి స్థాయి సమగ్ర విచారణ చేపట్టి దోషులను పట్టుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిజిపి ద్వారకా తిరుమ లరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లను సోమవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లెకు పంపించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని నిశితంగా పరిశీలించిన డిజిపి అధికారుల నివేదిక మేరకు ఇది ప్రమాదం కాదని ఉద్దేశ పూర్వకంగా జరిగిన చర్య అని స్పష్టం చేశారు. 25 రకాల అంశాలకు చెందిన దస్త్రాలు కాలిపోయినట్లు నిర్ధారణకు వచ్చినట్లు కలెక్టర్ శ్రీధర్ చేకూరి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు బృందాలకు చెందిన అధికారులు మంగళవారం ఉదయం నుంచి మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఏప్రిల్ 4, 2022 నుంచి భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరిగాయి, ఏ రికార్డులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయి, ఏయే భూములు వాస్తవ పొజిషన్ నుంచి సెటిల్ మెంట్ ల్యాండ్ కిందకు మారాయి తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి ఆధ్వర్యంలో రాయచోటి తహశీల్దారు జయన్న, నయాజ్ అహ్మద్ తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట మండలాల్లోని రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. రాజంపేట ఆర్‌డిఒ మనోహర్‌రావు ఆధ్వర్యంలో రాజంపేట తహశీల్దారు ఇంబనాథన్, ఓబులవారిపల్లె తహ శీల్దారు శేషగిరిరావు మదనపల్లె, నిమ్మనపల్లె రికార్డు లను పరిశీలిస్తున్నారు. మదనపల్లె హెచ్ఎన్ఎస్ఎస్-1 అధికారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో పీలేరు తహశీల్దారు మహబూబ్‌బాష, గాలివీడు తహ శీల్దారు శ్రీనివాసులు పీలేరు, గాలివీడు మండ లాలకు చెందిన రికార్డులను పరిశీలిస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్-3 పీలేరుకు చెందిన అధికారి రమా ఆధ్వర్యంలో రైల్వేకోడూరు తహశీల్దారు శివరాముడు, రామాపురం తహశీల్దారు శ్రీని వాసులు రామసముద్రం, పెద్దమండ్యం మం డలాల రికార్డులను పరిశీలిస్తున్నారు. రాజం పేటకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలా రాణి ఆధ్వర్యంలో వీరబల్లి తహశీల్దారు శ్రీని వాసులు, చిన్నమండెం తహశీల్దారు ఆనంద్ కుమార్ పిటిఎం, బి.కొత్తకోట మండలాల రికా ర్డులను పరిశీలిస్తున్నారు. ఏయే రికార్డులు తారు మారయ్యాయి, ఏ రికార్డులు కాలిపో యాయి సంబంధిత పూర్తి స్థాయి నివేదికను బుధవారం సాయంత్రానికి డిఆర్ఒ సత్యనారాయణరావు కలెక్టర్ నివేదించనున్నారు.



మదనపల్లె రైస్‌మిల్ మాధవరెడ్డి, నిమ్మనపల్లె జడ్‌పిటిసి భర్త వెంకటరమణారెడ్డి

పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలి : సిపిఎం

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసులో దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించాలని, ఈ ఘటనతో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదని, అదే సందర్భంలో సంబంధం లేని వారిని బలి చేయకూడదని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దహనంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కదిరి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. నిందితులను వదలొద్దు, అమాయకులు బలి చేయొద్దు, సబ్ కలెక్టర్ కార్యాలయం దహనం సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన సెక్షన్ 22 ఎ విభాగం, తపాలా విభాగం, ఎఒ కార్యాలయ విభాగంలో ఉన్న ఫైళ్లు, డాక్యుమెంట్లు డేటా కాలి బూడిదయ్యాయని అన్నప్పుడే షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేదు.. మానవ ప్రేరేపిత సంఘటనగా సిపిఎం ప్రకటించిందని తెలిపారు. 22 ఎ విభాగం అధికారిగా ఉన్న గౌతమ్ తేజ ఆదివారమైనా రాత్రి 11 గంటల వరకు కార్యాలయంలోనే ఉండటం, కీలకమైన 22 ఎ విభాగం, తపాలా విభాగంలో మాత్రమే ఫైళ్లు, డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయన్నార్ హుటాహుటిన మదనపల్లెకి వచ్చినా ఏమి తేల్చకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జరిగిన సంఘటనను రాజకీయాలకు ముడిపెట్టి లాభం పొందాలని అధికార పార్టీ అధికారులను బలి చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. డిజిపి అధికార పార్టీ నేతలను మాత్రమే కార్యాలయం లోపలికి తీసుకెళ్లి మంతనాలు జరపడం వలన సంఘటనతో సంబంధం లేని అధికారులను కూడా బలిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. వైసిపి, టిడిపి నాయకులు కుమ్మక్కై భూములు కాజేసిన విషయం ప్రజలందరికీ తెలుసని, కార్యాలయం దహనం వెనుక రెండు పార్టీల నాయకులు ఉండే అవకాశం ఉందని విమర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు, ఫర్నిచర్ కాలిపోయిన సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి, సంఘటనతో సంబంధం ఉన్న అందరిని శిక్షించాలని, భూ బాధితులకు అండగా ఉండాలని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్, రమణ, సురేంద్ర పాల్గొన్నారు.



కదిరి రోడ్డులో రాస్తోరోకో చేస్తున్న సిపిఎం నాయకులు

సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన స్పెషల్ సిఎస్ సిసోడియా

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఆదివారం రాత్రి జరిగిన దహనం ఘటనపై మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) సిసోడియా పరిశీలించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి, సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో జెఎండి చక్రధర్ బాబు, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, తదితరులు స్పెషల్ సిఎస్‌తో పాటు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం తగలబెట్టడంపై గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. కారణాలను త్వరితగతిన గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలిపోయిన ఫైళ్లను పరిశీలించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టు ప్రక్కల, ఆర్‌డిఒ కార్యాలయపు వెలుపలి వైపు చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించారు. కార్యక్రమంలో మదనపల్లె, రాయచోటి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాధవరెడ్డి ఇంట్లో తనిఖీలు జరుగుతుండగా బందోబస్తుగా ఉన్న పోలీసులు

'పెద్దిరెడ్డి' అనుచరుల ఇళ్లలో సోదాలు

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. కుట్ర కోణంపై ఇప్పటికే నిర్ధరణకు వచ్చిన పోలీసులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరులు రైస్‌మిల్ మాధవరెడ్డి, నిమ్మనపల్లె జడ్‌పిటిసి భర్త వెంకట రమణారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. మాధవరెడ్డి ఘటన జరగడానికి 10 రోజుల ముందు నుంచి క్రమం తప్పకుండా మాధవరెడ్డి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినట్టు గుర్తించారు. ఫైల్స్ దహనం కేసులో అతని హస్తం ఉందని నిర్ధరించుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పదిరోజుల పాటు వరుసగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎందుకు వచ్చారు? ఏయే దస్త్రాలకు సంబంధించి ఎవరెవరిని కలిశారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మాధవరెడ్డి, వెంకటరమణారెడ్డిలు ఇద్దరూ పెద్దిరెడ్డికి బినామీలుగా తెలుస్తోంది. వీరిరువురూ ఐదేళ్ల వైసిపి పాలనలో రూ.వందలకోట్లు విలువైన భూములు దోచుకోవడమే కాకుండా అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుంచి భూనష్టపరిహారం కింద రూ.కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో తేట తెల్లం అవుతోంది. రెవెన్యూ అధికారులు రైస్‌మిల్ మాధవరెడ్డి ఇంట్లో నుంచి కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు, కొన్ని కీలక డాక్యుమెంట్లను సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించడంతో పాటు అతని ఇంట్లో సుమారు 20 మంది రెవెన్యూ సిబ్బంది విస్తృత తనిఖీలు చేస్తుండడం ఆరోపణలకు బలమిస్తోంది. సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతైన ఘటనలో పెద్ద ఎత్తున భూ కుంభకోణ ఆరోపణలు వస్తున్న మాధవరెడ్డి పాత్ర ఏమైనా ఉందా అన్న కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా గతంలో ఇక్కడ ఆర్‌డిఒగా పనిచేసిన మురళి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ముద్ర ఉంది. ఇటీవల బదిలీ అయిన హరిప్రసాద్ కూడా పెద్దిరెడ్డికి సన్నిహితంగా ఉండేవారని తెలిసింది. వీరిద్దరినీ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చేకూరి, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విచారిస్తున్నారు.

నిరుద్యోగ సమస్యకు నిధులు నిల్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లోపభూయిష్టంగా ఉందని, అమానవీయ కార్పొరేట్ దోపిడీకి బిజెపి ఊతమిస్తుందని, ఉద్యోగం ఒక సామాజిక సమస్యని సుప్రీంకోర్టు చెప్పినా నివారణకు కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని అధ్యక్షతన 'కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ - నిరుద్యోగం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 145 కోట్ల మంది జనాభా ఉందని, 86 కోట్ల యువత ఉన్న వారికి నైపుణ్యం, సామర్థ్యం పెంచే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం వద్ద లేదన్నారు. సెమినార్లో సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివకుమార్ , రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు కడప నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు విజయ్, పెద్దన్న, అనిల్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కడప 'ఉక్కు'కు నిధులు కేటాయించాలి : డివైఎఫ్ఐ

బద్వేలు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, రూరల్ కార్యదర్శి బాల గురయ్యా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కడప ఉక్కు పై ప్రస్తావించి నిధులు రాబట్టాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం సడలిపోతుందని, దీని వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని, పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని పరిస్థితులు చక్కదిద్దాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కడప డిఇఒ కార్యాలయంలో డిఇఒ అనురాధను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, నాయకులు చంద్రశేఖర్, గోపీనాథ్, కేదార్నాథ్,శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు.

కామన్ సీనియారిటీ తేదీని ప్రకటించాలి..

2019 ఉద్యోగోన్నతులు పొందిన భాషోపాధ్యాయులందరికీ కామన్ సీనియారిటీ డేటును నవంబర్ ఒకటిగా పరిగణించాలని రాష్ట్రభాష ఉపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు బత్తల వెంకట ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ కోరారు. మంగళవారం డిఇఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా ఉపాధ్యాయ సంస్థ రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్చే..విదిలింపులే..!



- ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
- కొప్పర్తికి మౌలిక వసతులు
- వెనుకబడిన ప్రాంతాల నిధుల ప్రస్తావన
- రైల్వేలైన్ల ప్రస్తావన కరువు
- వేతన జీవులకూ నిరాశే

కేంద్ర బడ్జెట్ స్వల్పవిదిలింపులకే పరిమితమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం రూ.48.21 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ రాష్ట్రంలోని కూటమి సర్కారుకు నిర్లక్ష్యానికి పూర్తి స్థాయి బడ్జెట్‌లో చోటు లభించలేదు. జిల్లాలో కూటమికి 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేవలం కొప్పర్తి పారిశ్రామికవాడకు మౌలిక వసతులు, వెనుకబడిన ప్రాంతాలకు నిధుల ప్రస్తావనతో సరిపెట్టింది. రాష్ట్ర విభజనచట్టంలోని ప్రధాన హామీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. వ్యవసాయానికి, మౌలిక వసతుల కల్పనకు మోస్తరు కేటాయిం పులు చేసింది. వేతన జీవులను నిరాశ పరిచింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించింది. దేశంలోని నిరుద్యోగులకు మూడు పథకాల ద్వారా నాలుగు కోట్ల ఉద్యోగాల కల్పించనున్నట్లు పేర్కొనడం గమనార్హం.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్రంలో సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేసినప్పటికీ పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయింపుల జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజనచట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజె క్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపు తీరులోనే రైల్వే బడ్జెట్ ప్రస్తావన చేసింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే హామీనే విస్మరించడం గమనార్హం. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది వ్యవసాయాభివృద్ధికి రూ.1.32 లక్షల కేటాయింపులకు అదనంగా రూ.20 వేల కోట్లను జత పరిచింది. ఉమ్మడి జిల్లాలోని ఐదు లక్షల మంది రైతులకు ఆశించిన ప్రయోజనం లభించే అవకాశం లేదని చెప్పవచ్చు. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకపోవడం నిరాశను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది. ఓటాన్ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్ రూ.2.55 కోట్లతో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు టిడిపి ఎంపీల మద్దతు అవసరమైన పరిస్థితుల్లో గుడ్డిలో మెల్ల చందంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల ప్రస్తావన చేసింది. ఫలితంగా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయడానికి అవకాశం లభించింది. విశాఖ-చెన్నయ్ కారిడార్‌లో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని కొప్పర్తి పారిశ్రామికవాడకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల ఏర్పాటుకు పరిమితం కావడం గమనార్హం. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి-కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. రూ.మూడు లక్షల కోట్లతో మహిళా సంక్షే మానికి కేటాయింపులు చేసింది. వీరిలో తొమ్మిది కోట్ల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చనుందో తెలియాల్సి ఉంది. దేశం లోని కోట్లాది మంది నిరుద్యోగులకు మూడు రకాల పథకాలను ప్రకటించింది. వీటి ద్వారా ఐదేళ్లలో నాలుగు కోట్ల ఉద్యోగాలను కల్పించనున్నట్లు ప్రకటించింది.

లోపభూయిష్ట బడ్జెట్

కేంద్రంలో బిజెపి సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ లోప భూయిష్టమైంది. యువతకు నైపుణ్యం, సామర్థ్యం పెంపుదలకు సంబంధించిన కేటాయింపులు లేవు. నిరుద్యోగ సమస్య కారణంగా దేశంలో లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇటువంటి సమస్య పరిష్కారానికి కేంద్రం దగ్గర పరిష్కారాలు లేవు.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప జిల్లా.

అంకెల గారడీయే!

అంకెల గారడీనీ బడ్జెట్ తలపిస్తోంది. కూటమి సర్కారు నిధుల వరద ఏమైందో చెప్పాలి. కడప-బెంగళూరు, విజయవాడ రైల్వే ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ ఊసేలేదు. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మాటే లేదు.

- ఈశ్వరయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

రాష్ట్రానికి నిధుల కేటాయింపు హర్షణీయం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటించిన నిధులు హర్షించదగ్గ విషయం. అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల అభివద్ధికి, కేంద్రం నుంచి భారీగా నిధులు రావడం సంతోషం.

-ఆర్.శ్రీనివాసరెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు.

అరచేతిలో వైకుంఠం..

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపించింది. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు. విశాఖ మెట్రో రైలు, విజయవాడ మెట్రో రైలు ప్రస్థవనం లేదు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ద్వారా అద్భుతాలు ఏమీ జరగవు.

- తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్.

కంటితుడుపు చర్యే..

వేతన జీవులపై ఆదాయం పన్ను తగ్గింపు చాలా స్వల్పం. అది కంటి తుడుపు చర్య మాత్రమే. ఎల్ఐసి పొదుపు మొత్తాలకు ప్రత్యేక సెక్షన్ కింద పన్ను రాయితీ ఇవ్వాలి. ఎల్ఐసి ప్రీమియంలపై జిఎస్‌టి తొలగించాలి. నూతన ఎంపీలు వేతన జీవుల తరపున, బీమా పాలసీదారుల తరపున పార్లమెంటులో మాట్లాడాలి.

- ఎ.రఘునాథ రెడ్డి, ఎల్ఐసి కడప డివిజన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి.

వేతన జీవులను నిరాశపర్చింది..

పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలుగలేదు. సిపిఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తుమాట బడ్జెట్లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశకలిగించిందన్నారు.

- విజయ కుమార్, యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు.

నల్లాయపల్లె ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అట్లూరు

మండల పరిధిలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 40లో 445 ఎకరాల ప్రభుత్వ భూములు స్థానిక పేదలకు భూ పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్వేష్, వెంకటేష్ ప్రభుత్వ డిమాండ్ చేశారు మంగళవారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లాయపల్లె రెవెన్యూ గ్రామానికి చెందిన కమలాకూరు వలస పాలెం గ్రామాల పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని భూపోరాటం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టాలన్నారు. కానీ గత ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయటం వల్లనే వైసిపి ప్రభుత్వాన్ని గ్రామీణ పేదలు ఇంటికి సాగనంపారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూక బ్జాల దారుల పైన శ్వేత పత్రం విడుదల చేసి వదిలేయకుండా భూ కబ్జాలు చేసిన వారి వద్ద నుండి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు ప్రభుత్వం భూ సీలింగ్ యాక్ట్ అమలు చేయాలని, అప్పుడే ప్రభుత్వ భూములను అన్య క్రాంతం కాకుండా అరికట్టచ్చు అని పేర్కొ న్నారు. మండల పరిధిలోని నల్లాయ పల్లె రెవె న్యూ పొలం సర్వే నెంబర్ 40లో కమలాకూరు, వలస పాలెం, కాటంవారిపల్లి, ఓ మానస దిన్నె మీద పల్లె తదితర గ్రామాల పేదలకు పట్టాలు రెవెన్యూ అధికారులు ఇచ్చారని, ఆ భూములు ఏళ్ల తరబడి భూ ములకు సర్వే చేసి లబ్ధిదారులకు చూపించడం లేదని పేర్కొన్నారు. ఇదే అదునుగా స్థానికేతర్లు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు పెద్ద ఎత్తున భూములు ఆక్రమించి జామాయిల్, పండ్లతోటలు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ భూములను రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు దొంగ పాసుబుక్కులు , నకిలీ పట్టాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అసైన్డ్ చట్టపకారం పేదలకు ఇచ్చిన భూములకు మాత్రమే సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్గమ్మ, రమణయ్య, సుభద్రమ్మ, మాధవి, పార్వతి, సుశీలత, పాపలమ్మ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు



వ్య.కా.స ఆధ్వర్యంలో భూపోరాటం చేస్తున్న పేదలు

ప్రతి మహిళా ఆత్మ స్థైర్యాన్ని కలిగి ఉండాలి

ప్రజాశక్తి - బద్వేలు : ప్రతి మహిళా లైంగిక వేధింపులను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళాభివృద్ధి ,శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల అధికారులకు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు పోష్ చట్టం - 2013 గురించి అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ సిడిపిఒలు ఎం. శ్రీదేవి, ఎస్. శ్రీదేవి, ఎన్. లక్ష్మీ , డి ఎల్ డిఒ రజినీకాంత్, తహశీల్దార్లు, ఎంపిడి ఒలు, ఎంఇఒలు, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ అధికారులు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, ఐసిడిఎస్ పీడీ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విచారించి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కొండాపురం మండలం కె. సుగుమంచిపల్లె గ్రామ పొలంలో తన పేరుపై ఉన్న 0.33 సెంట్ల భూమిని ఇతరులకు అక్రమంగా ఆన్‌లైన్ చేశారని బాధితులు పి. చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కారాల వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో ఆర్ఐగా పని చేసిన అధికారి అక్రమంగా ఇతరులకు ఆన్‌లైన్ చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో విచారణ చేపట్టిన అధికారులు కొంతమందిపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. విచారణ వేగవంతం చేసి న్యాయం చేయాలని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : అన్ని దానాల్లోకల్లా రక్తదానం ఒకరి ప్రాణాన్ని కాపాడుతుందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. మంగళవారం రక్తదాన వారోత్సవాల్లో భాగంగా రిమ్స్ జిజిహెచ్ లోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా స్వచ్ఛందంగా రకదానం చేసి అధికారులతో పాటు జిల్లా ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. 36 సార్లు రక్తదానం చేసిన పాతాలజీ వైద్యసిబ్బంది కె.విజయ్ కుమార్‌కు కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, కడప నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప : మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణశేఖర్, స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అన్నారు. మంగళవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం, నంది మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల లో 'వ్యక్తిత్వ వికాసం- కెరీర్ కౌన్సెలింగ్" పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇరు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు దాదాపు 300 మందితో పాటు పాఠశాలల అధ్యాపకులు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాలను సందర్శించారు. సందర్భంగా ప్రభుత్వ పరిశీలన గృహంలోని పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల తరగతి గదులను పరిశీలించి పిల్లలు ఏయే తరగతులు చదువుతున్నారు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం విషయాలను పరిశీలించారు.


ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేస్తున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

పోలీసుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని ఖాళీ ప్రదేశాల్లో మందు తాగి బాటిల్స్ పడేసి పర్యావరణాన్ని పాడు చెయొద్దు అంటూ ప్రొద్దుటూరు వన్‌టౌన్ సిఐ శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్థానిక రామేశ్వరం రోడ్డులోని బుశెట్టి కల్యాణ మండపం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మందుబాబులు తాగి పడవేసిన మందు బాటిళ్లు, చెత్తను పోలీసులు, మున్సిపల్ సిబ్బంది తొలగించారన్నారు. ఖాళీ ప్రదేశంలో మందు తాగి ఇష్టానుసారం మందుబాబులు వ్యర్థాలను పడవేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మందుబాబుల్లో అవగాహన కల్పించేందుకు మొదటగా ఈ కార్యక్రమం నిర్వహించామని సిఐ తెలిపారు. వారిలో మార్పు రాకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పోలీసులు

ముద్దనూరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మైనుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని పలు ప్రదేశాల్లో మంగళవారం పోలీసులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్రాంతాల్లో మందు బాంబులు మద్యం సేవిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాల సమీపాల్లో మద్యం సేవిస్తే శిక్షకు గురవుతారని హెచ్చరించారు. ప్రజలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషారెడ్డి, కానిస్టేబుళు రవికుమార్, వంశీ పాల్గొన్నారు.

దువ్వూరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే కటకటాలు లెక్కించాలసిందేనని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పి ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసులు మందుబాబులపై దృష్టి పెట్టారు.

చెరువులను నింపి రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - ఖాజీపేట

రాజోలి అనకట్ట వద్ద 1200 క్యూసెక్కుల నీరు ఉన్నందున తక్షణం పూర్తిస్థాయిలో నీటిని వదిలి జిల్లాలోని కెసి కెనాల్ కింద ఉన్న అన్ని చెరువులను నీటిని నింపి రైతులను ఆదుకోవాలని వైసిపి నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి సూచించారు. తద్వారా వ్యవసాయ మోటర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. మండలంలోని దుంపలగట్టు గ్రామంలో తన స్వగృహంలో మంగళవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయానికి దాదాపు ఇన్‌ఫ్లో 1,49,647 క్యూసెక్కులు ఉన్నందున త్వరితగతిన శ్రీశైలం నిండే ఆస్కారం ఉందన్నారు. వర్షపు నీటి ఆధారంగా వరినార్లు పోసుకొనే వీలు కల్పించాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో రాజోలి ఆనకట్ట వద్ద నీటి నిల్వ ఉన్నందున చెరువులను నింపడంతోపాటు అన్ని కాలువలకు నీరు వదలాలన్నారు. తక్షణం నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, కెసి కెనాల్ అధికారులను కోరారు. విలేకరుల సమావేశంలో వైసిపి మండల నేతలు రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, ఇండ్ల వెంకటరెడ్డి, మున్నెల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమాకుమారి

సమస్యాత్మక స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వీరభద్రపురం గ్రామం వద్ద కొన్నేళ్లుగా సమస్యాత్మకంగా మారిన సర్వే నంబర్ 310లోని ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం తహశీల్దారు రమాకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టకూడదని ఇరు వర్గాల రైతులకు సూచించారు. ప్రస్తుతం ఈ స్థలంలో రేకుల షెడ్ ఏర్పాటు చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు తహశీల్దార్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ సాయిలత, విఆర్ఒలు మునిశేఖర్, శ్రీనువాసులరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రక్తమిస్తున్న దాత

రక్తదానం మహాదానం

ప్రజాశక్తి - మైదుకూరు

సమాజంలో రక్తదానంపై ఉన్న అపోహలు వీడి ఆరోగ్యవంతమైన 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులని, రక్తదానం చేసి బ్లడ్ బ్యాంకులో రక్తం కొరత లేకుండా చూడాలని మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కరిముల్లా పేర్కొన్నారు. స్థానిక మేధా డిగ్రీ కళాశాలలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కరీముల్లా హాజరయ్యారు. కార్యక్రమంలో 43 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన కుప్పం కిషోర్ 16వసారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్, శ్రీలక్ష్మీనరసింహ చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మాచునూరు సుబ్బరాయుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాగ్దాడం శివశంకర్, కిన్నెర ప్రసన్న కుమార్, కానాల ఈశ్వరయ్య, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, దేవిశెట్టి సుబ్రహ్మణ్యం, యడవల్లి హరేరామ్, సుబ్బు, మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఆనంద్‌రెడ్డి, కమల్ బాషా, కళాశాల ప్రిన్సిపల్ శెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండలాభివృద్ధికి కృషి చేయాలని జడ్‌పి ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ జేస్టాదీ శారదను వైసిపి నాయకులు, జడ్‌పిటిసి భర్త శాంతరాజు కోరారు. మంగళవారం రామాపురంలో ఆమెను కలిసి వారు సన్మానించారు. మండల పరిధిలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల జడ్పిటిసి ముత్యాల ప్రసాద్ ఉన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన డ్రెయినేజీ సమస్య

ఎమ్మెల్యే ఆదేశాలతో సమస్యాత్మక కాలువలో పూడిక తీత.. మళ్లీ పూడ్చివేయడంతో సమస్య యథాతథం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్న వరదాయ్యపల్లి గ్రామంలో కొంతకాలంగా డ్రెయినేజీ సమస్య నెలకొని ఉంది. ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆ సమస్యను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తెచ్చారు. పోలీసుల సహకారంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వెంటనే జెసిబిని ఉపయోగించి మురుగునీరు తొలిగేందుకు కాలువను తవ్వించారు. అయితే రెండు రోజులు ఆగిన తర్వాత పంచాయతీ సిబ్బంది తవ్వించిన కాలువను మళ్లీ పూడ్చడంతో సమస్య తిరిగి మెదలెంది. వర్షం నీరు నిలువడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో డయోరియా కేసులు అధికంగా ఉండడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్నవరదాయపల్లెలో నివాసాల మధ్య నిలిచిన వర్షపునీరు

మహిళల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సునీత

ప్రజాశక్తి - వేంపల్లె

మహిళా ఉద్యోగుల పట్ల ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిడిఒ సంపతి దివిజా, సిడిపిఒ సునీత పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు 2013 (పోష్ యాక్ట్) నిరోధక చట్టంపై గ్రామ సచి వాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా యాజమాన్యం బాధ్యత వహించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించేందుకు పోష్ యాక్ట్ చట్టాన్ని 2013 ఏప్రిల్ 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మహిళలను తాకడం, మాటలు, సైగలు, పోర్న్ వీడియోల ద్వారా మహిళలను వేధిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల పట్ల ఎవరూ దురుసుగా ప్రవర్తించరాదన్నారు. ప్రతి కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టె పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందికి మంగళవారం పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో ప్రతి రంగంలోనూ, ప్రతి కార్యాలయంలోనూ పురుషులతోపాటు మహిళలు కూడా సమానంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోష్ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, అన్ని సచివాలయాల సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను సరిచేసిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని ఎన్.కోటాలపల్లె మార్గంలోని పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు సరిచేశారు. సమస్యను ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 22న 'కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన విద్యుత్ అధికారులు వెంటనే ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేశారు. సత్వరమే స్పందించిన విద్యుత్ అధికారులను రైతులు, రైతు కూలీలు అభినందించారు. కార్యక్రమంలో ఎఇ రామకృష్ణ, లైన్‌మెన్లు పాల్గొన్నారు.


ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న అధికారులు

రెండో రోజు 432 మంది విద్యార్థులకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో 2024-25 సంవత్సరానికి జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ రెండవ రోజూ 432 మందికి అడ్మిషన్లు ఇచ్చినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు చేపట్టిన అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఆయా జిల్లాల నుండి అడ్మిషన్లకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సౌకర్యాలు కల్పించామన్నారు. డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో జరిగినా అడ్మిషన్ల ప్రక్రియను అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర సండ్రా, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులను సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. రెండవ రోజు అడ్మిషన్ల నిమిత్తం 525 మందికి సమాచారం ఇవ్వగా, 432 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర సండ్రా తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు.ఒంగోలు క్యాపస్‌కు సంబంధించి ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలోనే బుధ, గురువారాల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ కన్వీనర్ రత్నకుమారి, పిఆర్ఒ తిరుపతిరెడ్డి, రోజర్ బిన్ని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - సింహాద్రిపురం


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి సుబ్బారెడ్డి

సన్న, చిన్న కారు రైతులు నూతనంగా పండ్ల తోటలు సాగు చేసే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు ఆ పథకం ఎపిడి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ పండ్ల తోటలైన చీనీ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, జామ వంటి పండ్ల తోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. నూతనంగా సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపిడిఒ సల్మాన్ రాజ్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ జయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విఫలం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో గుర్తింపులేని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో మండల విద్యాశాఖ అధికారులు విఫలమైనట్లు రాయలసీమ విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెకు విచ్చేసిన సర్వశిక్ష అభియాన్ ప్రోగ్రాం రాష్ట్ర అధికారి కల్పన శైలకు ఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు బందెల ఓబులేసు, టిఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, పిఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు ఎంఇఒ జాఫర్ సాదిక్‌పై వినతి పత్రం అంద జేశారు. మూడు మం డలాల బాధ్యతల నుంచి ఎంఇఒ జాఫర్ సాదిక్‌ను తొలగిం చాలని కోరారు. నిబం ధనలకు విరుద్ధంగా గుర్తింపులేని పాఠశాలలు వేంపల్లెలో నడుస్తున్నట్లు చెప్పారు. అరకొర అను మతులు తీసుకొని సెంట్రల్ సిలబస్ పేరు తో నర్సరీకి రూ.42 వేలు ఫీజు తీసుకుంటున్నారని చెప్పారు. పలు సమస్యలను వారు వివరించారు. ఇందుకు స్పందించిన ఎస్ఎస్ఎ ప్రాజెక్టు అధికారి కల్పన శైల మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ప్రాజెక్టు రాష్ట్ర అధికారి కల్పన

భవిత కేంద్రాల్లో చక్కటి బోధన చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

భవిత కేంద్రాల్లో విభిన్నప్రతిభావంత విద్యార్థులకు చక్కటి బోధన చేయాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు రాష్ట్ర అధికారి కల్పన శైల ఆదేశించారు. వేంపల్లెలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కార్డులను పరిశీలించి, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు ఆత్మ స్థైర్యంగా ముందడుగు వేసేలా బోధించాలని కోరారు. భవిత కేంద్రంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పథకాలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఇ జిల్లా కో-ఆర్డినేటర్ కేశవరెడ్డి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రమణమూర్తి, ఎంఇఒలు జాఫర్, స్టాలిన్, ఐఈఆర్టీలు యశోద, సుజాత పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ఆధార్ సర్వర్

- పడిగాపులు కాస్తున్న జనం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు కోసం ప్రత్యేకంగా ఆధార్ అప్డేషన్ క్యాంపులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని శ్రీరామ టెంపుల్ సచివాలయంలోని ఆధార్ అప్డేషన్ కేంద్రంలో సరిగా రాకపోవడంతో జనాలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. సర్వరే కాకుండా స్కాన్ చేయడానికి స్కానర్‌తో కూడిన ప్రింటర్ పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. దీంతో ఆధార్ అప్డేషన్ కోసం ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

శుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించి వ్యాధులను దూరం చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి కోరారు. స్థానిక జిన్నామోటులోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం 'సీజనల్ వ్యాధులు-స్టాప్ డయేరియా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. కార్యాలయంలో వైద్యులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

అగ్నిప్రమాదంలో జామ చెట్లు దగ్ధం

ప్రజాశక్తి - చాపాడు



మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలోని కాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమం వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల 150 జామచెట్లు బూడిద పాలయ్యాయి. అధిక గాలులకు రెండు వైర్లు తగులుకోవడం వల్ల నిప్పులు చెలరేగి గడ్డిలో పడ్డాయి. గడ్డిలో మంటలు లేచి పక్కనే ఉన్న జామ చెట్లకు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను ఆర్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి సంబంధించిన ఖాళీ ప్రదేశంలో జామచెట్లను పెంచారు.


చెట్లకిందకు చేరిన సచివాలయ సిబ్బంది

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రెండేళ్లుగా అద్దె చెల్లించలేదని మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం-2కు ఆ ఇంటి యజమాని మంగళవారం తాళం వేశారు. అద్దె చెల్లించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని యజమాని తెలిపారు. సచివాలయానికి తాళం వేయడంతో సిబ్బంది చెట్లకిందకు చేరారు. సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలు వెనుదిరిగి వెళ్లారు.


గోడపత్రాలను విడుదల చేస్తున్న గుర్రం డేవిడ్‌రాజ్

డివైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 27, 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ పిలుపునిచ్చారు. స్థానిక డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో నేషనల్ పీజీ కళాశాలలో శిక్షణాతరగతులు జరుగుతాయన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రదీప్, ఓబులేసు, సత్య, శ్రీహరి పాల్గొన్నారు.


కొలతలను పర్యవేక్షిస్తున్న రెవెన్యూ అధికారులు

అల్లాడుపల్లె దేవళాలు స్థలం కొలతలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం వద్ద మంగళవారం రెవెన్యూ అధికారులు కొలతలు వేశారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు దేవస్థానం స్థలాన్ని గుర్తించాలని తహశీల్దార్ రమాకుమారి పర్యవేక్షణలో సర్వేయర్లు స్థలాన్ని కొలతలు వేశారు. కొలతలు పూర్తయిన తర్వాత పూర్తి నివేదిక అందజేస్తామని, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీల, సర్వేయర్ సాయిలత, విఆర్ఒ మునిశేఖర్, ఆలయ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ట్రెజరీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సిఐ మోహన్

కార్యాలయాల భద్రతపై పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మదనపల్లి ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘటనతో పోలీస్ అధికారులు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. మంగళవారం పులివెందులలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డు రూముల్లో భద్రతకు సంబంధించి పులివెందుల టౌన్ ఇన్‌ఛార్జి సిఐ మోహన్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను అక్కడున్న సిబ్బందికి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.